# చింపిరి

నిన్న సాయంకాలం దేవుడు కనిపించాడు!" అన్నాడు చింపిరి నిముషం వ్యవధి రెండోసారి.

మొదటిసారి ఆ మాట మిగిలిన ముగ్గురూ వినిపించుకోలేదు. ఇప్పుడు వాళ్ళకు స్పష్టంగా వినిపించింది.

"ఏ దేవుడు? ఎక్కడ కనిపించాడు?"అని అడిగింది బుజ్జమ్మ ఉత్సుకతతో.

"నాకు తెలిసినవాడే. ఈ మధ్యనే కలిశాడు. భలే తెలివిగలవాడు! ఎంత బాగా మాట్లాడుతా డనుకున్నావు! రోజుకు పాతిక రూపాయలు సంపాయిస్తాట్ట!"

బుజ్జమ్మ నవ్వి, "భలేవాడివే! దేవుడంటే అసలు దేవుడనుకున్నాం !" అంది.

సమయం రాత్రి పదిన్నర గంటలు. ఆ బ్రహ్మాండమైన స్టేషన్ చివర ఒక ప్లాట్‌ఫారం మీద గోడ పక్కగా ఈ నలుగురూ....

నిప్పుకోడి గాడికి అనుమానం కలిగింది. నిన్నటి నుంచీ - ఆ మాటకొస్తే ఇటీవల కొన్నిరోజుల నుంచీ, చింపిరిగాడి వాలకం అనుమానంగానే ఉంది. మనిషి మునుపటిలా ఉండటంలేదు. ఈ ఉదయం పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో తాము బయలుదేరే టప్పుడు కూడా వాడిలో హుషారు లేదు. ఏదో తప్పనిసరై తమ వెంట నస్తున్నట్టు వచ్చాడు. ఇవాళ రైల్లో పెట్టె లూడ్చి సంపాదించిన డబ్బులో మామూలుగా చెప్పినట్టే వాడి భాగం లెక్క చెబితే "ఇదేం డబ్బు? ఇదేం సంపాదన? ముష్టి రెండున్నర రూపాయలా?" అని మొదటిసారిగా చప్పరించాడు. అక్కడికి తానేదో లక్షలు సంపా

యించడానికి పుట్టినట్టూ....తాము వాడిని రైలుపెట్టె లూడ్చి అడుక్కునే పాడు జీవితంలోకి దింపినట్టూ ఉంది వాడి వాలకం, ఇదంతా ఆ దేవుడనేవాడు చేసిన ఉపదేశ ఫలితమే.

నిప్పుకోడిగాడు ఇప్పుడిక ఊరుకోలేక అడిగాడు.

"ఏం చెప్పాడు మీ దేవుడు?"

చింపిరి అదోక రకంగా మొహం పెట్టి నేల చూపులు చూస్తూ నెమ్మదిగా "తనతో వచ్చెయ్యమన్నాడు. రైలుపెట్టెలు ఊడ్చి ముష్టెత్తడం ఖర్మ ఏమిటన్నాడు. ఇదీ ఒక బతుకేనా అన్నాడు. స్టేషన్ వదిలి బయటపడితే సవాలక్ష పనులున్నాయన్నాడు. ఏ పని చేసుకుని అయినా నిక్షేపంగా గౌరవంగా బతకొచ్చునన్నాడు" అని చెప్పాడు.

"ఏం చేస్తావు మరి?" అని అడిగాడు నిప్పుకోడి.

చింపిరి చాలాసేపు మాట్లాడలేదు. దిక్కులు చూస్తూ కూర్చున్నాడు.

రాత్రి బాగా పొద్దుపోయింది. ప్లాట్‌ఫారం మీద మధ్యలో జనం పలుచగా ఉన్నారు. రాత్రివేళ వచ్చేరైళ్ళుమాత్రం అప్పుడప్పుడూ గర్జిస్తూ వస్తున్నాయి.

ఎదురుగా ఆకాశంలో చంద్రబింబం .... పలుచగా వెలుగుతున్నది. వీళ్ళకు కొంచెం దూరంలో ఎత్తయిన ఫెన్సింగ్ మీద పక్షి ఏదో కూర్చుని నణుగుతున్నది.

బుజ్జమ్మ నిద్రకు ఉపక్రమించింది. దానికి చింపిరిగాడి మాటల మీద గాని, వాడి వాలకం మీద గాని పెద్దగా ఉత్సాహం కలగలేదు. కోటిగాడు మిగిలిన వారి కన్నా ఒకటి రెండేళ్ళు చిన్న. వాడు మాత్రం ఆత్రుతతో వింటున్నాడు.

నిప్పుకోడి మనసులో చాలా ఆలోచనలు ఉన్నాయి.

తాము ఎక్కడెక్కడ పుట్టారో, కన్నవారెవరో, ఏమీ తెలియదు. ఇలా కలుసుకుని ఒక్కటైనారు. దేశంలోకెల్లా అతిపెద్దదైన ఈ స్టేషనే లోకంగా బతుకుతున్నారు. రైళ్ళలో ఎక్కి పెట్టెలు ఊడ్చి శుభ్రం చేసి, ప్రయాణీకుల ముందు చేతులు జాపి, వాళ్ళు దయతో విదిల్చిన కాసిని పైసలే అయినా పోగుచేసుకుని పొట్ట పోసుకుంటున్నారు. పస్తులుండటం లేదు.

ఇక్కడ అప్పుడప్పుడు పోలీసులు తరిమినా తన్నినా అది తాత్కాలికమే. రైల్వే సిబ్బంది కూడా అట్టే బాధ పెట్టరు, అపరిశుభ్రంగా ఉండే రైలు పెట్టెలు శుభ్రం చేసి ఒక విధంగా రైల్వేలకు జీతం బత్తెం లేని సేవ చేస్తున్నారని అనుకుంటారే తప్ప తమను ఎవరూ హింసించరు. ఇది ఒదిలిపెట్టుకుని స్టేషన్ దాటి బయట ప్రపంచంలోకి, మహా నగరంలోకి అడుగుపెడితే....

తలచుకోడానికి భయంగా ఉంటుంది. క్రూరమృగాలతో నిండిన అరణ్యం

లాంటిది ఈ నగరం. నిరంతరం బందులు, హత్యలు, ప్రమాదాలు,బాంబు దాడులు, అత్యాచారాలు, పోలీసు స్టేషన్లు, దోపిడీలు తలుచుకుంటే వెన్నులో నుంచి వణుకు పుట్టుకొస్తుంది.

చింపిరి కిందికి జరిగి పడుకున్నాడు. వాడి ఆలోచనలు వాడివి.

దేవుడు నిన్న కనిపించి స్టేషన్‌లో నుంచి బయటకు తీసుకుపోయి, టీ ఇప్పించి మరీ చాలాసేపు మాట్లాడాడు. . "రైలు పెట్టెలూడ్చి అడుక్కునే బతుకూ ఓ బతుకేనా?" అన్నాడు. "మానవ జన్మ ఎత్తినందుకు ఆ ప్రభువు మనకు కాళ్ళూ, చేతులూ,తలకాయా ఇచ్చినందుకు గౌరవంగా బతకాల"న్నాడు. "పదిమంది ముందూ చేయిజాపి యాచించడం నీచ"మన్నాడు. ఇంకేవేవో గొప్ప గొప్ప మాటలు మాట్లాడాడు.

ఇప్పుడు....

చింపిరిగాడు కృతనిశ్చయుడైనవాడిలా లేచి కూర్చున్నాడు.

తనవైపే చూస్తున్న నిప్పుకోడిగాడినీ, కోటిగాడినీ ఉద్దేశించి నెమ్మదిగానే అయినా ఖచ్చితంగా చెప్పాడు - "నేను పొద్దున్నే ఎల్లిపోతాను. పినాకినిలో మీతో పాటుగా రాను. దేవుడు చెప్పాడు - ఏదో షాపులో వోసరు గారికి చేతికిందికి మనిషి కావాలంట ! రోజుకు పది రూపాయ లిప్పిస్తానన్నాడు. నేనెల్లిపోతాను."

నిప్పుకోడిగాడు ఆ మాట వినవలసివస్తుందని అనుకునే ఉన్నాడు కాబట్టి చలించలేదు.

"మరి నీ డబ్బు?"

"దాన్దేముంది? తర్వాత తీసుకుంటాన్లే !"

కోటిగాడు నిరుత్సాహపడి ఏదో సన్నగా గొణిగాడు కాని. అంతలో ఏదో ఫాస్ట్ గూడ్స్ బండి దాదాపు వంద పెట్టెలతో రొద చేస్తూ వచ్చి దూరంగా ఆగింది. ఆ రొదలో- హోరులో వాడి సణుగుడు వినబడనేలేదు.

బుజ్జమ్మ చీకటి ఉండగానే లేచింది. మట్టి నిండిన గోళ్ళతో మట్టికొట్టుకున్న జుట్టు సరిచేసుకుంది. తర్వాత అవతలికి వెళ్ళివచ్చింది.

కోటిగాడు లేచి నిప్పుకోడిగాడిని, చింపిరిగాడిని లేపాడు.

పది నిముషాల్లో చింపిరి తప్ప మిగిలిన ముగ్గురూ చీపుళ్ళతో పినాకిని ముందు నిలబడ్డారు. చింపిరి చీపురు తీసుకోలేదు.

సరిగ్గా ఉదయం ఆరుగంటలు .... పినాకిని 'బొయ్' మని అరిచి కదలబోతున్నది.

చింపిరి ప్లాట్‌ఫారం మీద నిబ్బరంగా నిలబడ్డాడు. కొత్త జీవితంలోకి అడుగుపెట్టబోతున్న ఉత్సాహంలో నిలబడ్డాడు.

మరు నిమిషంలో పినాకిని ఒక్క ఉదుటున కదిలింది. మరుక్షణంలో వేగం పుంజుకుంది. చింపిరి నిలబడిపోయాడు.

రైలుపెట్టె గుమ్మంలో నిలబడి బుజ్జమ్మ "ఇక ఈడు మనతో రాడా?" అని అడిగింది.

కోటిగాడు కచ్చగా "రాకపోతే పోనీయ్! అన్నాడు.

నిప్పుకోడిగాడు ఏమీ మాట్లాడలేదు.

బుజ్జమ్మ మళ్ళీ కసిగా "ముదనష్టపోడు!" అన్నది.

"ఎవరు?" అని అడిగాడు కోటిగాడు.

"ఆదే! ఆ దేవుడే!" అన్నది బుజ్జమ్మ మరింత కసిగా.

*　　*　　*

పినాకిని కనుచూపుమేర దాటిపోయాక చింపిరి అలాగే కొన్ని క్షణాలు ప్లాట్ ఫారం మీద నిలబడిపోయాడు. తర్వాత ఆవులించి చేతివేళ్ళు విరుచుకున్నాడు.

ఇక ఒక నిశ్చయానికి వచ్చినవాడిలా వడివడిగా నడక సాగించాడు. గేటులో అటూ ఇటూ ఉన్న టి.సి.లు వీణ్ని చూశారు. అందులో సురేశన్ మాత్రం వీణ్ని చూసి"ఏరా! మీ వాళ్ళతోపాటు నువ్వు వెళ్ళలేదేం?" అని అడిగాడు.

చింపిరి వెర్రి నవ్వు నవ్వుతూ తల ఊపాడేతప్ప బదులేమీ పలకలేదు. వొదిగి వొదిగి నడుస్తూ గేటులోగుండా హాల్లోకి వచ్చాడు.

విశాలమైన హాలు. ఎందరో రకరకాల మనుష్యులున్నారు. ఎవరి లోకంలో వాళ్ళున్నారు. హడావిడిగా ఉన్నారు. కౌంటర్లముందు మామూలుగానే పొడవాటి క్యూ లున్నాయి. చింపిరి లాగూ జేబులో అయిదు రూపాయలున్నాయి. ఆ మొత్తం వాడికి ఒకవిధమయిన భరోసా ఇస్తున్నది.

మెట్లుదిగి ఆవరణదాటి ఇవతలికి వచ్చి గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు. స్టేషన్ అనబడే పెద్ద పంజరం నుంచి బయటకు వచ్చినట్టనిపించింది.

ఉదయంవేళ గాలి హాయిగా వీస్తున్నది.

దేవుడు చెప్పిన వివరాలు గుర్తు చేసుకుంటూ నడక సాగించాడు. రోడ్డు పక్కన అటూ ఇటూ అప్పుడే అలజడి. జనసంచారం మొదలైంది.

ఎదురుగా ఒక హోటలు....లోపల ఉజ్వలంగా లైట్లు వెలుగుతున్నాయి. చింపిరికి టీ తాగుదామనిపించింది.

ఠీవిగా వెళ్ళి ఒక కుర్చీలో కూర్చున్నాడు.

క్యాష్ బల్ల వెనుక కూర్చున్న ఒకలావుపాటి వ్యక్తి అది చూసి, అంతలో "రేయ్! లే లే!" అని అరిచాడు.

చింపిరి ఉలిక్కిపడి లేచాడు.

"ఏం కావాలి?" అని గద్దించాడు అతడు మళ్ళీ.

"టీ" అన్నాడు చింపిరి బలహీనంగా.

ఆ వ్యక్తి వెయిటర్‌ని పిలిచి, "వాడికి టీ ఇచ్చి డబ్బులు తీసుకో!" అన్నాడు

ఆ విధంగా బయటనే నిలబడి టీ తాగి డబ్బులు చెల్లించి ఇవతలికి వచ్చాడు చింపిరి. లోలోపల ఏదో బాధ అనిపించింది. అంతలో 'ఆఁ! దాన్దేముంది! ఇది లోకం' అనుకున్నాడు.

సన్నని గొందులు, సందులు. అటూ ఇటూ పొంగి పొర్లుతున్న మురికి కాలువలు....ముక్కు బద్దలుచేసే దుర్గంధం .... విశృంఖలంగా బురదలో పొర్లు తున్న పందులు.... అన్నీ దాటుకుని నడిచాడు. ఇదుగో మసీదు....పక్కనే సన్నని సందు.... ముందు చిన్న అరుగు, అక్కడ ఆగి తలుపు తట్టాడు.

కటకటమని చప్పుడు చేస్తూ పాతకాలపు చెక్క తలుపు తెరుచుకుంది. ఒక మధ్య వయస్కురాలు గుమ్మానికి అడ్డంగా నిలబడి, అప్పుడే నిద్రలేస్తున్నది కాబోలు, ఆవులిస్తూ "ఎవరూ" అన్నది.

"దేవుడు.... దేవుడున్నాడా?" అని అడిగాడు చింపిరి.

ఆమె వెనుదిరిగి వెళ్ళింది.

కొద్ది క్షణాల్లో దేవుడు వచ్చాడు. నల్లని చొక్కా, తెల్లని లాగూ తొడుక్కుని ఉన్నాడు. మనిషి నలుపు. క్రాపు వెనక్కు దువ్వాడు. చింపిరిని చూసి గుర్తించి. తెల్లని పళ్ళు బయటపడేలా నవ్వుతూ "నువ్వా! అయితే నువ్వొచ్చేశావన్నమాట!" అన్నాడు.

"వచ్చేశాను" అన్నాడు చింపిరి.

"పద" అంటూ నడిచాడు దేవుడు.

వాడు రకరకాల పనులు చేస్తాడు. వాడి తండ్రి వృద్ధుడు. మంచానపడి ఉంటాడెప్పుడూ. వాడి అక్క రాత్రుళ్ళు వాడుకగా వచ్చే రిక్షాలో ఎక్కి వెళ్ళి తెల్ల వారుజామున ఇంటికి చేరుతూ ఉంటుంది. వాడికి నిలకడ ఇష్టంలేదు. మామూలు పనులలో ఆసక్తి అసలే లేదు. నిరంతరం థ్రిల్ కావాలి. ఎక్కువ సంపాదన కావాలి. సినిమా టికెట్లు బ్లాకులో అమ్మగం, రద్దీగా ఉన్న సినిమా హాళ్ళలో క్యూలో నిలబడి జేబులు కొట్టడంవంటి పనులు వాడికి ఇష్టం.

వాడి కివాళ చేతినిండాపని. అందుకే తెల్లవారుతూనే బయలుదేరాడు. ఒక మహానటుడి మహా కళాఖండం నగరంలో ఏడెనిమిది హాళ్ళలో రిలీజవుతున్నది. బోలెడంత జల్లరీ అగసూ, రద్దీ....తొక్కిసలాట. దేవుడు మహా బిజీ ఇవ్వాళంతా.

దేవుడు మాట్లాడుతున్నాడు. ఎడతెరిపి లేకుండా మాట్లాడుతున్నాడు. నేరుగా ఇందాకటి హోటలుకే తీసుకెళ్ళాడు. ఇందాక చింపిరిని దబాయించిన వ్యక్తి ఈసారి వాళ్ళిద్దరూ లోపల కూర్చుంటూ ఉంటే చూసికూడా ఏమీ మాట్లాడలేదు.

"టీ తాగానిప్పుడే!" అన్నాడు చింపిరి.

"ఫరవాలేదు, మళ్ళీ తాగు!" అన్నాడు దేవుడు.

ఆ తర్వాత చింపిరిని వెంటబెట్టుకుని నడిచి ఒక వైన్ షాపుకు తీసుకెళ్లాడు.

ఆ షాపులో అటూ ఇటూ అద్దాల బీరువాలలో లెక్కలేనన్ని రంగు రంగుల సీసాలున్నాయి. ఒకపక్కన పెద్దపెద్ద అట్టపెట్టెలు నిలువెత్తున పేర్చబడి ఉన్నాయి. ఆ పక్కనే గోడమీద రకరకాల దేవుళ్ళ బొమ్మలు ఉన్నాయి.

బల్లవెనుక ఒక భారీ వ్యక్తి కుర్చీకి నిండుగా కూర్చుని ఉన్నాడు.

దేవుడు, "నమస్కారం సార్!"అన్నాడు

ఆయన సిగరెట్ ముక్క విసిరేసి, "ఏరా! నేను చేతికిందికి మనిషి కావాలని చెప్పి ఎన్నాళ్ళయింది?" అన్నాడు విసుగ్గా.

"తెచ్చాను సార్! ఇడుగో!" అని చింపిరిని ముందుకు తోసి, "చాకు అనుకోండి! పేరు చింపిరి" అన్నాడు.

ఆయన పెద్దగా నవ్వుతూ "చింపిరి.... అదేం పేరురా?" అన్నాడు.

చింపిరి తలవంచుకుని నిలబడ్డాడు.

"శ్రద్ధగా పని చేస్తాడా?"

"రెండ్రోజులు చూడండి. మీకే తెలుస్తుంది!" అన్నాడు దేవుడు.

"ఇదిగో అబ్బాయ్! ముందే చెప్తున్నాను. జాగ్రత్తగా ఒళ్ళు దాచుకోకుండా పని చెయ్యాలి. రోజుకు ఎనిమిది రూపాయలిస్తాను"

అక్కడ దేవుడు కలగజేసుకుని "అదే కాదు, పైన బోలెడొస్తుంది. కష్ట మర్సు తలా అర్ధరూపాయకు తక్కువ ఇవ్వరు. అది కనీసం పదికి తగ్గదు" అన్నాడు.

చింపిరి తల ఊపాడు.

దేవుడు "నాకు పనుందిసార్! వెళ్తా" నంటూ వెళ్ళిపోయాడు.

షాపు యజమాని చింపిరికి పనులు చెప్పాడు. అన్నిటికన్నా ముందు ఖాళీ సీసాలలో నీళ్ళు నింపి కూలర్‌లో ఉంచాలి. బీరు సీసాలు కూడా కూలర్‌లో సర్దాలి. లోపల మూలనున్న రెండు కుండలనిండా నీళ్ళు పట్టుకురావాలి. ఇవి అయిన తరువాత కొన్ని సీసాలపేర్లు చెప్పి పరిచయం చేశాడు.

"ఏది అడిగితే అది అందివ్వాలి!" అన్నాడు చివరగా.

సాయంకాలం వరకు పెద్ద ఇబ్బంది ఏమీ లేదు. అప్పుడొకరు అప్పుడొకరు వచ్చి తాగి పోతున్నారు. చీప్ లిక్కరు వచ్చింది కదా! దానికి గిరాకీ ఎక్కువ.

చాలాసేపు చింపిరి పనిలేకుండా కూర్చున్నాడు. మధ్యాహ్నం వెళ్ళి పక్కన చిన్న హోటల్లో ఏదో ఇంత తిని వచ్చాడు. ప్రశాంతంగానే ఉందనిపించింది. అప్పటికి రెండురూపాయల ఆదాయం కూడా వచ్చింది.

సాయంకాలం అయిదారు గంటల నుంచి పరిస్థితి మారింది. అసలు హడావుడి మొదలయింది.

రిక్షాల వాళ్ళు, తోపుడు బళ్ళవాళ్ళు ఎడతెగకుండా రావడం, ద్రవం గ్లాసులో పోసుకుని నీళ్ళు కలిపి గడగడ తాగి వెళ్ళడం -లోపల నిలబడి కొందరు, కూర్చుని మరికొందరు బీర్లు, విస్కీ, బ్రాందీలు సేవించడం మొదలయ్యింది. గ్లాసులు, నీళ్ళు అందించడంతో, మిరపకాయ బజ్జీ, మిక్చర్‌లు, సిగరెట్లు తెచ్చి ఇవ్వడంతో ఊపిరి సలపని విధంగా పని మొదలయింది, ఒకడు పిలిస్తే వెళితే మరొకడు కేకపెడతాడు.

"కుర్రాడు లేడా? ఎక్కడ సచ్చాడు!" వంటి అరుపులు ఎక్కువయి పోయాయి.

"రేయ్! సిగరెట్లు తే! ఇక్కడున్నట్టు రావాలి!" వంటి ఆజ్ఞలు జారీ అవుతున్నాయి. పొద్దుగూకే కొద్దీ అలజడి, రద్దీ ఎక్కువయింది. షాపు యజమానికి తోడు మరొకరెవరో కూడా కేష్ దగ్గర కూర్చున్నారు. రెండు చేతులా బేరం చేస్తున్నారు.

చింపిరి శ్వాస తీసుకోవడం కూడా మరచిపోయి పరుగులు తీస్తున్నాడు.

రాత్రి పన్నెండు గంటలవరకు ఇదే వరస. ఆ తర్వాత రద్దీ తగ్గింది. కాని షాపు యజమాని కేష్ లెక్కపెట్టుకోవడం, సీసాలు సర్దుకోవడం వంటి పనుల్లో మునిగి పోయాడు.

తర్వాత చింపిరితో, "రేయ్! అట్టా నిలబడ్డావేందిరా? మొత్తం లోపలి నుంచి చిమ్ముకురా. శుభ్రంగా చిమ్మాల!" అని ఆజ్ఞాపించాడు.

చింపిరి నీరసంగా లేచి చీపు రందుకున్నాడు. లోపల అంతా భయంకరంగా ఉంది. చిమ్మడం మొదలుపెట్టాడు. అంతా ఉమ్మివేతలు, ఖాళీ సిగరెట్ పెట్టెలు, సిగరెట్ పీకలు, అగ్గి పుల్లలలో ఛండాలంగా ఉంది.

కాళ్ళ మీద కూర్చుని చిమ్ముతూ చింపిరి ఉన్నట్టుండి బాధపడ్డాడు. తాను ఇన్నాళ్ళూ రైలు పెట్టెలు ఊడ్చేవాడు. అక్కడ ఇంత ఛండాలం ఎన్నడూ చూడలేదు.

అర్ధరాత్రి దాటాక షాపు యజమాని ఉబ్బి, లావుగా మొసలి పిల్లలా ఉన్న తోలు సంచి తీసుకుని, ఇవతలికి వచ్చి షట్టర్లు దించి, అతి జాగ్రత్తగా పెద్ద పెద్ద తాళాలు వేసి, పదిసార్లు లాగి లాగి చూసి, చింపిరితో - "ఒరేయ్ ! ఇక్కడే పడుకో! జాగ్రత్త!" అని మళ్ళీ మళ్ళీ చెప్పి మోటారు సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

వీధి అంతా నిర్మానుష్యంగా ఉందిప్పుడు. లైట్లు మందంగా వెలుగుతున్నాయి.

చింపిరి అక్కడే కూలబడి ఎప్పుడో తెచ్చి జేబులో పెట్టుకున్న పుణుగులు తిన్నాడు. తర్వాత షాపు ముందు కొంతమేర తుడుచుకుని పడుకున్నాడు.

నిప్పుకోడి, కోటి, బుజ్జమ్మ గుర్తుకొచ్చారు.

తర్వాత తన 'సంపాదన' గుర్తుకొచ్చింది. యజమాని ఇచ్చే ఎనిమిది రూపాయలు కాక, తన దగ్గర మరో ఎనిమిది రూపాయలు చేరాయి. సంతృప్తిగా కళ్ళు మూసుకున్నాడు. ఎప్పుడో నిద్రపట్టింది.

మరునాడు జరిగింది అసలు కథ.

చింపిరి రాత్రి పదకొండు గంటలు దాటేసరికి కదులుతున్న శవంలాగా తయారయ్యాడు. కాళ్ళలో సత్తువ బొత్తిగా క్షీణించింది.

షాపు యజమాని కేకలు ఎక్కువైనాయి. తాగుబోతుల కేకలు, తిట్లు కూడా ఎక్కువైనాయి.

ముగ్గురు కూర్చుని ఉన్నారు లోపల. చవకబారు మద్యం పెద్ద సీసా ఖాళీ అవుతున్నది- పెద్దగా మాట్లాడుతున్నారు. ఉండి ఉండీ తిట్టుకుంటున్నారు. సిగరెట్లు ఊది పారేస్తున్నారు. 'నీయమ్మ....నీయక్క' వంటి ప్రయోగాలు మాటిమాటికీ దొర్లుతున్నాయి.

వాళ్ళలో ఒకడు తుమ్మమొద్దులా గున్నాడు. ఉన్నట్టుండి "రేయ్ ! నీయమ్మ....కుర్రోడా! నీళ్ళియ్!" అని అరిచాడు.

చింపిరి నీళ్ళ సీసా తెచ్చి ఇచ్చాక ఒకడు "సల్లగా లేవురా, నా కొడకా!" అనీ, మరొకడు ఇంతసేపట్రా!" అనీ గాండ్రించారు.

మరొకడు రూపాయి బిళ్ళ ఇచ్చి,"ఎల్లి గోల్డుప్లేకు సిగరెట్టు....ఒక్కటంటే ఒక్కటి పట్రా!" అన్నాడు.

చింపిరి పరుగున వెళ్ళి సిగరెట్ తెచ్చాడు.

దాన్ని అందుకుని "నలిపేశా వేందిరా నంజకొడకా!" అన్నాడు వాడు.

చింపిరికి ఒళ్ళు మండుకొచ్చింది. కాని ఏమీ మాట్లాడలేదు.

మళ్ళీ ఆ మనిషి "చిల్లరేదీ? రెండ్రూపాయ లిచ్చాగా?" అన్నాడు.

చింపిరి "మీ రిచ్చింది రూపాయే!" అని బదులు చెప్పాడు.

"అమ్మ! అమ్మ! దొంగనంజకొడకా! నేనిచ్చింది రెండ్రూపాయల బిళ్ళ .... తే. చిల్లర!"

చింపిరి 'మీ రిచ్చింది రూపాయే'నన్నాడు మళ్ళీ.

ఆ మనిషిలేచాడు. నిషా తలకెక్కిందేమో, తూలిపడబోయాడు. నిలదొక్కుకున్నాడు.

"చిల్లర దొబ్బి .... నా కొడకా! అబద్ధమాడతావురా?" అంటూ తన మీదకి వచ్చాడు. పక్కవాళ్ళు లేచి ఆపారు.

షాపు యజమాని "ఏం దా గోల?" అంటూ వచ్చాడు.

విషయం విని "ఏరా?" అని సంజాయిషీ అడుగుతున్నట్టు ఆయన చింపిరి వైపు తిరిగాడు.

చింపిరి కళ్ళ వెంట నీళ్ళు ఉబికి వచ్చాయి.

"రూపాయే ఇచ్చారండీ! సిగరెట్టు తెచ్చిచ్చాను" అన్నాడు.

ఆ మనిషి రెచ్చిపోయి బూతులు మొదలు పెట్టాడు.

చింపిరి ఇక ఆలస్యం చేయలేదు. జేబులోనుంచి రెండో మూడో అర్థ రూపాయి బిళ్ళలు తీసి స్టూలుమీద ఉంచి ఇవతలికి వచ్చాడు.

షాపు యజమాని చింపిరి వైపే చూస్తున్నాడు. వాడి కళ్ళలో నీళ్ళు చూశాడు. అయినా ఏమీ మాట్లాడలేదు. వెళ్ళి నోట్లు తెక్కపెట్టుకుంటూ కూర్చుండిపోయాడు.

లోపలి నుంచి ఆ ముగ్గురూ ఇవతలికి వచ్చారు. ఆ మనిషి చింపిరి వంక తీవ్రంగా చూస్తూ "దొంగనాకొడుకు! దొంగనా బుద్ధులు!" అంటూనే నడిచాడు.

చింపిరి ఆయిదు నిముషాలపాటు అలాగే నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

పొద్దుపోయినందువల్ల బేరం పలుచనయింది.

"రేయ్! లోపలి నుంచి అంతా చిమ్మకురా! తర్వాత సీసాల్లో నీళ్ళు పెట్టు. బీర్లు కూలర్‌లో సర్దు" అని పనులు పురమాయిస్తూనే నోట్లు లెక్కపెట్టుకుంటు న్నాడు షాపు యజమాని.

చింపిరి ఇప్పుడు లేచాడు. లేచి నిబ్బరంగా ముందుకు అడుగువేశాడు. యజమాని ముందు నిలబడ్డాడు.

యజమాని, "ఏందిరా అట్టా నిలబడ్డావు?" అని అడిగాడు.

"నే నెల్లిపోతాను. ఇక్కడుండను!" అన్నాడు చింపిరి దృఢంగా.

షాపు యజమాని ఆశ్చర్యంతో "ఏందిరా? తిక్కతిక్కగా ఉందా ఏంది?" అంటున్నాడు.

"నే నెల్లిపోతున్నాను. ఇక్క డుండను" అన్నాడు చింపిరి మళ్ళీ గట్టిగా.

"ఏమైందిరా?"

"నే నెల్లిపోతా నిక్క డుండను!"

ఆయన సొరుగు మూసి "నీ కర్మ పోతే పో ! కానీ ఆలోచించుకో, నీకు కాణీ కూడా ఇవ్వను. ఇట్టా వచ్చి అట్టా ఎల్లిపోతా ఉంటే ఎట్టా?"

"కానీ కూడా ఇవ్వొద్దు! నే నెల్లిపోతాను."

చింపిరి షాపు వెలుపలికి వచ్చి విసురుగా, వేగంగా నడవడం మొదలు పెట్టాడు. వెనుక ఎవరో తరుముకొస్తున్నట్టు నడిచాడు. సందులు, గొందులు దాటాడు. ప్లే గ్రౌండ్ దాటాడు. ఆఫీసు బిల్డింగ్‌లు దాటాడు.

దూరంగా అద్భుతమైన వెలుతురులోకంలా కన్నతల్లిలా ఆ మహాస్టేషన్ కనిపిస్తున్నది.

చింపిరి గబగబా నడిచాడు. మెట్లెక్కి హాలు దాటాడు. గేటు దాటి ప్లాట్ ఫారం మీదికొచ్చాడు. తను మామూలు చోటికి దూసుకుని వస్తున్నాడు.

మంచినీళ్ళు తాగి ఇటు తిరిగిన బుజ్జమ్మ దూరం నుంచి చింపిరిని చూసి ఆనందంతో పెద్దగా "అదే! అడుగో! నే చెప్పలేదా వస్తాడని. వచ్చేస్తున్నా డొచ్చేస్తున్నాడు!" అని కేక పెట్టింది.

*